సుదర్శన నారసింహ మహాయజ్ఞానికి భూమిపూజ

వచ్చే నెల 26 నుంచి యజ్ఞం ప్రారంభం



నేచురల్ స్టోన్స్ తీసుకొస్తున్న పూసపాటి అశోక్‌గజపతి రాజు, ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు



భూమి పూజలో భాగంగా యజ్ఞశాల ప్రదేశంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: లోక కల్యాణార్థం సింహగిరిపై మార్చి 26 నుంచి ఏప్రిల్ 1వతేదీ వరకు నిర్వహించనున్న చదుర్వేద హవనపూర్వక, పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి ఆదివారం భూమిపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహగిరిపై ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రదేశంలో యజ్ఞానికి సంబంధించిన పనులు ప్రారంభించారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, వాస్తు ఆవాహనం, వాస్తు పురుష ఆవాహనం, వాస్తు కలశ ఆవాహనం నిర్వహించారు. అనంతరం నాగలి, ఎద్దులకు పూజలు చేశారు. ఏడుసార్లు కర్షణం(భూమిని దున్నే కార్యక్రమం) నిర్వహించారు. యాగభూమిని శుద్ధి చేశారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు , దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, వంకాయల సాయినిర్మల సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవి వర్మ, దశమంతుల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ మాట్లాడుతూ లోకం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో సింహగిరిపై పెద్ద ఎత్తున సుదర్శన నారసింహ మహా యజ్ఞం నిర్వహించ తలపెట్టినట్టు చెప్పారు. 50 మంది రుత్వికులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మార్చి 26న ఉదయం రుత్విక్ వరణం, సాయంత్రం అంకురార్పణతో యజ్ఞం ప్రారంభమవుతుందన్నారు. 27 ఉదయం అగ్నిప్రతిష్ఠ ఉంటుందన్నారు. ఏప్రిల్ 1 ఉదయం పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో యజ్ఞం ముగుస్తుందన్నారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని తరించాలని కోరారు. యజ్ఞంలో పాల్గొనే భక్తుల విధి విధానాలను త్వరలో ప్రకటించనున్నట్టు తెలిపారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పదేళ్ల తర్వాత సింహగిరిపై సుదర్శన నారసింహ మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆధునికీకరణ

సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న కల్యాణ మండపం ప్రాంగణాన్ని దాతల సహకారంతో ఆధునికీకరిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అటు వైదికపరంగా, ఇటు భక్తులకు వినియోగపడేలా షెడ్ నిర్మాణం, నేచురల్ స్టోన్స్‌తో ఫ్లోరింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. నగరానికి చెందిన అంగర రాజేష్ అనే దాత 25వేల ఎస్ఎఫ్‌టీ మేర నేచురల్ టైల్స్‌తో ఫ్లోరింగ్ ఏర్పాటుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఈ మేరకు సంబంధిత నేచురల్ స్టోన్స్‌ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు ప్రదర్శించారు.షెడ్ నిర్మాణం కూడా దాతల సహకారంతో చేస్తామని తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో పూజ నిర్వహిస్తున్న అర్చకుడు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా విర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదంని అర్చకులు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజని నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురం నుంచి కంఫర్ట్ హోమ్స్ వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.68 కోట్లతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు సీఎం వైఎస్ జగన్ సారథ్యంలోని ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చందుయాదవ్, కంచిబోయిన సంతోష్, దేముడుబాబు, రమణమూర్తి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీడిమామిడి తోట ఫలసాయం కోసం బహిరంగ వేలం

సబ్బవరం: మండలంలోని లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన జీడిమామిడి తోట ఫలసాయం అనుభవించడానికి బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి కె. ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నెంబర్ 79లో 3.50 ఎకరాల జీడిమామిడి తోట ఏడాది ఫలసాయానికి, సర్వే నెంబర్ 70/7,70/11 లలోని 3.60 ఎకరాల భూమి మూడేళ్ల కౌలు సాగుకు ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ వేల పాటను ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు స్వామివారి దేవస్థానం వద్ద టెండర్ కమ్ బహిరంగ వేలం పాట ద్వారా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జీడిమామిడి తోట ఫలసాయానికి రూ.5 వేలు, కౌలు హక్కుల కోసం రూ.10 వేలు ధరావత్తుగా చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

ఇష్టానుసార పార్కింగ్‌పై కొరడా

విశాఖ సిటీ: రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలకు పోలీస్ శాఖ సమాయాత్తమవుతోంది. రోడ్లపై, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారికి చలానాలు వేయాలని నిర్ణయించింది. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని షాపింగ్ మాల్స్, ప్రధాన షాపుల యాజమాన్యంతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాహనాలు రోడ్ల మీద కాకుండా సెల్లార్ పార్కింగ్ చేసుకునేలా చూడాలని సూచించారు. నగరంలో వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వారిపై మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం రూ.1000 జరిమానా విధించనున్నారు. వాహనాలను టోయింగ్ రికవరీ వ్యాన్‌తో తీసుకువెళ్లి, వీల్ లాక్స్ చేయడం జరుగుతుందని ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాస్ స్పష్టం చేశారు. అలాగే పార్కింగ్ సౌకర్యం ఉండి పార్కింగ్‌నకు వినియోగించని షాపుల యాజమాన్యంపై కూడా చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే సెక్షన్ 190ఏ మోటార్ వాహనాల చట్టం ప్రకారం వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై, మోటార్ వాహన నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో హెల్మెట్ విధిగా ధరించేలా వారిని అప్రమత్తం చేయాలని సూచించారు.

పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి



మాట్లాడుతున్న ఐఆర్ఎస్ అధికారి ఈదర కిరణ్‌కుమార్

సీతంపేట : జీవితం కోసమే చదువు అని కాకుండా, జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా మన పిల్లలను తయారు చేయాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర కిరణ్‌కుమార్ అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో పిల్లల విద్యలో రావలసిన మార్పులు అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని, నేటి చాట్ జీపీటీ యుగంలో ఒట్టి జ్ఞాపక శక్తి, బట్టీ చదువులకు చోటే లేదన్నారు. మార్కులు, ర్యాంకులపై వేలం వెర్రి తగ్గాలని సూచించారు. చిన్నతనం నుంచే ఇష్టమైన హాబీలు అలవర్చుకోకుంటే జీవితం యాంత్రికం అయిపోతుందన్నారు. పిల్లలు రోజూ ఆంగ్ల దినపత్రిక చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ పిల్లల్లో అనేక రకాల మేధో కుశలతలు ఉంటాయని, ప్రతి విద్యార్థిని ఒక ప్రత్యేక వ్యక్తిగా చూడాలన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సదస్సులో చర్చించిన విషయాలు, విద్యా విధానంలో రావాల్సిన మార్పుల గురించి పాఠశాలలకు ఉపయోగపడేలా నిర్దిష్ట ప్రణాళిక తయారు చేసి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు పంపనున్నట్లు తెలిపారు.

బౌద్ధంతోనే అసమానతలు దూరం

సీతంపేట : బౌద్ధ ధర్మం ద్వారా అసమానతలు దూరం చేయవచ్చని పలువురు బౌద్ధ మేధావులు పేర్కొన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో 11వ బౌద్ధ మహా సమ్మేళనం నిర్వహించారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో డాక్టర్ అయూపాల మయతెరో (మయన్మార్) సారిపుత్ర ధర్మ ప్రబోధన చేశారు. వీసీకే అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్, బాంసెఫ్ జాతీయ నాయకుడు నల్లా గంగాధర్, బౌద్ధ రచయిత డి.నటరాజ్ సాఖ్య, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత సమాజంలోని అసమానతలను తొలగహించాలంటే బౌద్ధం ఒక్కటే మార్గమన్నారు.

క్లుప్తంగా

250 మందికి వైద్యసేవలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెందుర్తి: సురభి క్లినిక్, ఆర్.వి. కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. దాదాపు 250 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సురభి క్లినిక్, ఆర్వీ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.వి.ఎస్ రాము, డాక్టర్ లక్ష్మి మాధవి, డాక్టర్ ఎం.రచన, డాక్టర్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి, సుజాతనగర్ కాలనీ కార్యదర్శి డి.ఎస్. మూర్తి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తున్న సిబ్బంది

పెందుర్తి: సుజాతనగర్ సత్యసాయి భక్త బృందం, ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 41 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, సత్యసాయి భక్త బృందం గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, నాయకులు తమ్మిరెడ్డి శివశంకర్, కంచిపాటి విశ్వనాధనాయుడు, సేనాపతి శేఖర్, పన్నింటి పార్వతి, సత్యసాయి సంస్థ ప్రతినిధులు బుజ్జిబాబు, జ్యోతి, గోపి, తాతారావు, సీతారామయ్య, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

30 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: పరవాడ గ్రామానికి చెందిన చింతాడ శివసాయి ఆదివారం స్థానిక మద్యం దుకాణం నుంచి అక్రమంగా 30 మద్యం సీసాలు తరలిస్తుండగా ఎస్ఐ టి.మల్లేశ్వరరావు దాడి చేసి పట్టుకున్నారని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. అక్రమ మద్యం సీసాలు విలువ రూ.4,800 ఉంటుందని చెప్పారు. అక్రమ మద్యం సీసాలతో సంబంధం ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

ఘనంగా బంగారమ్మతల్లి తీర్థం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత బంగారమ్మ తల్లి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారిని గ్రామస్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు,కుంకుమలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు దర్శించుకున్నారు. బంగారు తల్లి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

టెన్త్ విద్యార్థుల ప్రత్యేక తరగతుల పరిశీలన



శిక్షణ తరగతులను పరిశీలించి మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలని అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ విద్యార్థులకు సూచించారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక శిక్షణ తరగతులను ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. సబ్జెక్టుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుని ప్రతీ విద్యార్థి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాశాఖ కార్యాలయ అధికారి వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేషంగా పుష్పయాగం

- పరవశించిన భక్తజనం
- ముగిసిన వార్షిక కల్యాణోత్సవాలు



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. స్వామివారికి శ్రీపుష్పయాగం, ఊంజల్‌సేవ విశేషంగా నిర్వహించారు. భక్తులు కనులారా ఈసేవలను తిలకించి పులకించిపోయారు. వెవెంకన్న, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని మండపంలో అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, చక్రాభ్యమండల అర్చన, పాలికా అర్చన, ద్వాదశ ఆరాధనను విశేషంగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామికి పుష్పాంజలి సేవ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి పూజలను పర్యవేక్షించారు.

అప్పన్నను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని



జస్టిస్ ప్రియదర్శినికి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం సాయంత్రం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను సూపరింటెండెంట్‌లు కనకరాజు, వెంకటరమణ అందజేశారు.

కరాటే పోటీల విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న సీఐ బాలసూర్యారావు

పరవాడ: శ్రీ రామచంద్రమ్మ పండగను పురస్కరించుకొని వాడచీపురుపల్లిలో రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్ షిప్ ఆదివారం నిర్వహించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో అనకాపల్లి జట్టు, ద్వితీయ స్థానంలో విశాఖపట్నం, తృతీయ స్థానంలో విజయనగరం క్రీడాకారులు నిలిచారు. విజేతలకు సీఐ ఎస్.బాలసూర్యారావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురదరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కూండ్రపు సీతారామయ్య, తాతాజీ, గ్రాండ్ మాస్టారు సారిపల్లి నూకరాజు, కోచ్ పుష్పారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మార్చి 3,4 తేదీల్లో ఘంటసాల వర్ధంతి



మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌చంద్ర

సీతమ్మధార : అమర గాయకుడు, గాన గంధర్వుడు ఘంటసాల 50వ వర్ధంతి మార్చి 3,4 తేదీల్లో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడిల్ గంధర్వ ఏపీ -2024 పేరిట నిర్వహిస్తున్నట్లు ఘంటసాల స్మారక పీఠం ఉత్తరాంధ్ర వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్‌కుమార్ తెలిపా రు. ద్వారకానగర్‌లోని సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడుతా తియ్యగా మాదిరి ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు ద్వారా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో ఉన్న 9 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వయసు గల గాయనీ గాయకులకు పాటల పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4వ తేదీన ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్ట్ లోగో ఆవిష్కరణతో పాటు ఘంటసాల స్వర పోషకులు, గాయకుడు దాము గేదెలకు జీవన సాఫల్య పురస్కారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ హీరో సుమన్, మిమిక్రీ ఆర్టిస్ట్, సినీ నటుడు శివారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని అన్నారు. దాము గేదెల మాట్లాడుతూ భవితరాలకు ఘంటసాల గాన మాధుర్యాన్ని అందించేందుకు ఐడిల్ గంధర్వ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం కో-ఆర్డినేటర్ మాధవీకృష్ణ, శ్రీమాతా మ్యూజిక్ అధినేత పల్లి నాగభూషణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలి



1109వ రోజు ఉక్కుదీక్షలో సంస్థను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల పోరాటాల ఫలితంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా దేశ ప్రజలందరూ ఏకమై కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు సూచించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1109వ రోజు, ఆదివారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు విషయంలో ప్రజలందరూ కేంద్రప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. సంస్థ కోసం కార్మికులు నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రంలో చలనం లేకపోవడం దారుణమన్నారు.

రేపు పాదయాత్ర

ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడంలో కార్మిక వర్గంతో పాటు దేశప్రజలంతా మమేకమై పాల్గొనాలని కోరారు. ఈ నెల 27న కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి జీవీఎంసీ దీక్ష శిబిరం వరకు జరిగే పాదయాత్రలో కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని మోదీ సానుకూల ప్రకటన చేయాలి



పెదగంట్యాడ జంక్షన్ నుంచి పాదయాత్ర చేస్తున్న అఖిల పక్షాల నాయకులు

పెదగంట్యాడ: వచ్చే నెల 1న విశాఖ పర్యటనకు రానున్న ప్రధాని నరేంద్ర మోదీ.. 'విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుంది' అని ప్రకటన చేయాలని అఖిల పక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ పిలుపు మేరకు ఐఎస్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన పెదగంట్యాడ జంక్షన్ నుంచి నడుపూరు వరకు ఆదివారం ఉదయం మహా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1100 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అదానీకో, అంబానీకో స్టీల్‌ప్లాంట్‌ను ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. పెదగంట్యాడ జంక్షన్ వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర సిద్ధేశ్వరం, దల్లివానిపాలెం, కోరాడ, సీతానగరం, బాలచెరువు, నెల్లిముక్కు మీదుగా నడుపూరు వరకు సాగింది. కార్యక్రమంలో అనిపెద్ది మసేనురావు, నీరుకొండ రామచంద్రరావు, రామస్వామి, పులి వెంకటరమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, గొందేశి మహేశ్వరరెడ్డి, డీవీ రమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, జెర్రిపోతుల ముత్యాలు, చెల్లుబోయిన నాయుడు, నెల్లి అప్పలరాజు, కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టులో ఉద్యోగికి అస్వస్థత

పెదగంట్యాడ: గంగవరం పోర్టులో పని చేస్తున్న ఓ ఉద్యోగి ఆదివారం అస్వస్థతకు గురవడంతో, ఆస్పత్రికి తరలించారు. వివరాలివి.. గంగవరం గ్రామానికి చెందిన అర్జల అమ్మోరు (45) గంగవరం పోర్టులో 16 ఏళ్లుగా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం ఉదయం ఏ షిఫ్టుకు డ్యూటీకి వెళ్లిన అమ్మోరు ఒక్కసారిగా అక్కడ కుప్పకూలిపోయాడు. దీంతో వెంటనే అతన్ని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించేందుకు పోర్టు అధికారులు సిద్ధం చేయగా.. తోటి కార్మికులు అడ్డుకుని, ప్రైవేటు ఆస్పత్రికి తరలించాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో ఒక్కసారిగా అక్కడి వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్బన్ ఏసీపీ మోజెస్ పాల్, న్యూపోర్టు సీఐ దాలిబాబు సిబ్బందితో అక్కడికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. ఆపై ఏసీపీ మోజెస్ పాల్ స్వయంగా 108 వాహనంలో బాధితుడిని షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అమ్మోరు అక్కడ చికిత్స పొందుతున్నారు.